# చుట్టుపక్కల చూడరా!



– కర్లపాలెం హనుమంతరావు

## సమకాలీన సమస్యలపై వ్యంగ్యాస్త్రాల పరంపర!!

*6*

### *దేశ భాషలందు తెలుగు లెస్స!*

**తెలుగువాళ్ళం మనం 'ఆc.. తెలుగేకదా!'** అని మన అమ్మ భాషను మనం తేలిక చేసి మాట్లాడతాం గానీ తెలుగువాడు కాకపోయినా శ్రీకృష్ణ దేవరాయలు మన తెలుగుకి 'దేశభాషలందు లెస్స' అని ఏనాడో ఒక సర్టిఫికెట్ ఇచ్చి పారేశాడు. పలుభాషలు తెలిసిన ఉద్దండులు తన భువన విజయంలో ఉన్నా రాయలువారు తెలుగు పలుకు వైపుకే ఎందుకు తూగు చూపారో.. తెలుసా?!

తెలుగు మాట అందచందాలు అటువంటివి మరి. సందేహంగా ఉందా? అయితే మచ్చుకకి ఐదారు ఉదాహరణలు నాకు తోచినవి విన్నవించుకుంటాను. చదివి చివరలో తమరూ తమ అభిప్రాయం నాకు చెప్పండి! నాతో ఏకీభవిస్తారనే నా నమ్మకం.

పఠాభి అని మనకొక కవి ఉన్నాడు. ఆయనో పంచాంగం రాసి పారేశాడు. అందులో ఆయన తెలుగు పదాలతో బంతాట ఆడుకున్నాడు. వేనోళ్ళ కొనియాడబడేది 'బబుల్ గం' - అట! ఎంత చక్కని నిర్వచనం. నిజమేగా, కొన్న తరువాత నోటిలో అలా ఆడించేది బబుల్ గమ్మేకదా! ఆశుకవిత్వం అలవోకగా నోట పలికే ఉద్దండ పండితులు తిరుపతి వేంకట కవులు. వారి అష్టావధానాలలోని విశిష్ట పద్యాలను అలా చెప్పుకుంటూ పోతే అదే ఒక ఉద్గ్రంధ రాజమవుతుంది. పకోడీల మీద వారు వేయించిన కరకరపదాల పొహళింపు తిని చూడటం కాదు.. విని తలవంచవాల్సిందే!

*శనగపిండి, ఉల్లిపాయ, చిన్ని మిర్పకాయలన్*
*జునిపి అందు అల్లమంతదొనిపి ముద్ద చేసినన్*
*అనల తప్తమైన నేతి యందు వైచి వేచినన్*
*జను పకోడి అనెడు పేర చక్కనైన ఖాద్యమౌ!*

పకోడి ఎంత రుచిగా ఉంటుందో.. ఈ జంట కవుల వంటకం అంత రుచిగా ఉందంటే.. కాదనగలమా!

బేతవోలు రామబ్రహ్మం గారు ఆధునిక వేమన శతకం పేరుతో నేటి మార్కుల విధానాన్ని ఎలా తూర్పార పట్టారో అవధరించండి.

*మార్కులిచ్చు వాడు మా మంచి మాస్టారు*
*చదువు చెప్పువాడు చవటగాడు*
*మాదు శిష్యులెల్ల 'మార్కిస్టు'లైనారు*
*విశ్వదాభిరామ వినురవేమ*

అని ఆచార్యులవారు చదువులమీద వేసిన చురకలకి వేమనయినా జీవించి ఉంటే నోరు వెళ్ళబెట్టి ఉండేవాడే! అవునా.. కాదా! అర్థం పర్థం లేకుండా వాక్యాలను నడుందాకా తెగకొట్టి కట్టెల మోపును తెలిపి పుల్లలను వరసగా పేర్చినట్లు అక్షరాలను పేర్చుకుంటూ పోతే అదే ఆధునిక కవిత్వమయిపోతుంది - అనుకునే మహానుభావులు చాలామందే నేడు కనపడుతున్నారు. ఈనాడే కాదు భావకవిత్వం మంచి జోరుమీదున్న రోజులలో కూడా ఈ విమర్శ ఉంది.

*రెండు కాకులు కూర్చుండె బండమీద*
*ఒండెగిరిపోయె నంతనందొండు మిగిలె*
*రెండవది పోయె పిదపనందొండు లేదు*
*బండ మాత్రము పాపమందుండి పోయె!*

ఈ పద్యం విన్న వాడికెవరికైనా మతిపోకుండా ఉంటుందా?

అర్థం పర్థం లేకుండా పద్యం చెప్పాలని మరీ కంకణం కట్టుకుని పంతం బట్టి ఒక కవి రాసిన పద్యం ఇది అయినా, పాపం ఆయన ఆశ నెరవేరలేదు. ఇందులో బోలెడంత అర్థం బాగుందని ఒక విమర్శక శిఖామణి సోదాహరణంగా వివరించడానికి పూనుకున్నాడు. "రెండు కాకులు అంటే జీవాత్మ పరమాత్మలంట. బండ అంటే దేహం. ముందు జీవాత్మ, తరువాత పరమాత్మ అనంతంలో కలిసిపోయాయనీ.. అలా వెళ్ళిపోయినా దేహం మాత్రం బండరాయిలాగే నిర్జనంగా అలా ఉండిపోయింద"ని వ్యాఖ్యానం చేసేసాడు ఆ విమర్శకుడు. పద్యం చెప్పిన కవే అవాక్కయిపోయిన విచిత్ర పరిస్థితి. తెలుగా... మజాకా.. మరి!

తెనాలి రామకృష్ణుని పేర చాలా చాటువులు ప్రచారంలో ఉన్నాయి. అవి చాలా సరదాగా కూడా ఉంటాయి. అసలు రచనలు మాత్రం యమ సీరియస్. పాండురంగ మహత్యమే దానికి పెద్ద తార్కాణం. అందులోని నిగమశర్మ అక్క పాత్రను ఈ కవి చిత్రించిన విధానం అపూర్వం. అలాంటి ఉదాత్త స్రష్ట పేరున చలామణి అయే ఈ చాటువు విచిత్రం చూడండి!

అల్లసాని పెద్దనగారు తన మనుచరిత్రలో 'అమవస నిసి' అని ఛందస్సు కోసం ఒక చోట కక్కుర్తి పడ్డారని వెక్కిరిస్తూ అదే పంథాలో చెప్పిన పద్యం:

*ఎమితిని సెపితివి కపితము*
*భ్రమ పడి వెరిపుచ్చకాయ వడిదిని సెపితో*
*ఉమెతకయను తిని సెపితో*
*అమవసనిసి అన్నమాట అలసనిపెదనా!*

అదే అల్లసానివారిని మరో పద్యంలో తనతో కలుపుకుని కాకమాని మూర్తి కవి అనే పెద్దమనిషి

*అల్లసాని వాని యల్లిక జిగిబిగి*
*ముక్కు తిమ్మనార్య ముద్దుపలుకు*
*పాండురంగ విభుని పదగుంఫనంబును*
*కాక - మాని (కి) రాయ (టం).. నీకె తగురా!*

అని చివరి పాదాన్ని విరిచి "అవి కాక దురదతో వీపు చెట్టు మానుకు రాయడం మాత్రం నీకే తగింది" అది విరిచి పెడర్థం తీసి అభాసుపాలు చేశాడని ఒక సరదా కథ. మునగ చెట్టు ఎక్కించడానికైనా, పడేసి వెక్కిరించడానికైనా తగిన సరంజామా అందించే మన భాష మరి సామాన్యమైనది అంటే ఒప్పుకుందామా?! రాసారు మన తెలుగువారు. నమ్మశక్యం కావటం లేదా? అయితే అవధరించండి.

*ఎంచగ చతుర్ధ జాతుడు*

*పంచమ మార్గమున నేగి ప్రధం తనూజం*

*గాంచి తృతీయం బచ్చట*

*నుంచి ద్వితీయంబు దాటి యొప్పుగ వచ్చెన్.*

ఈ పద్యం అర్ధం కావాలంటే ముందు మనం పంచభూతాల ఫార్ములా పక్కన రాసి పెట్టుకోవాలి

భూమి =1

నీరు = 2

నిప్పు = 3

గాలి = 4

ఆకాశం = 5

చతుర్ధ జాతుడు = వాయుపుత్రుడు

పంచమ మార్గం = ఆకాశ మార్గం

ప్రధమ తనూజ = సీతాదేవి

తృతీయం = నిప్పు

ద్వితీయం = సముద్రం

వాయుపుత్రుడైన ఆంజనేయుడు ఆకాశ మార్గాన ప్రయాణం చేసి భూమి పుత్రిక అయిన సీతమ్మ వారిని చూసి, లంకలో (తృతీయాన్ని) నిప్పుని పెట్టి. (ద్వితీయం) సముద్రాన్ని దాటి వచ్చేసాడని చమత్కారమన్నమాట.

బాపూగారినొకాయన కలవడానికని వచ్చి కలిసి మూడుగంటలు గడిచినా అచ్చట్లు ముచ్చట్లు ఆపకుండా చెప్తూనే కూర్చోనున్నాడట. చివరికి తన తప్పు తెలుసుకుని లేచిపోబోతూ "నేను బైలుదేరుతున్నాను. ఏమన్నా కావాలా?" అని అడిగితే బాపు మొహమాటంగా నవ్వుతూ "అంతకన్నా ఇంకేం కావాలి?" అన్నారట.

ఇన్ని తెలుగు అందాలు కష్టపడి సేకరించి ఇచ్చాను.. మన తెలుగు భాష గొప్పతనాన్ని చెప్పటానికని. ఇవి చాలా ఇంకేమన్నా కావాలా? ముగిస్తున్నాను అని నేను గనక అంటే మీ చేత "అంతకంటే ఏం కావాలి?" అని అనిపించుకోక ముందే ఇంతటితో ముంగిచేస్తే నాకూ, మన భాషకూ మంచిదంటారా?...

సరే.. అలాగే కానీయండి.. వచ్చే నెల మరో ముచ్చటతో మళ్ళీ ఎలాగో కలుస్తూనే ఉంటాంగా!

టా..టా!

<u>కొసమెరుపు:</u>

లక్ష్మణ యతీంద్రులుగా పేరు పడ్డ సంప్రదాయ కవి ముత్తేవి లక్ష్మణ దాసుగారు ఒకసారి కర్ణాటక సంగీత కచేరీకని వెళ్ళి "గాయకుని గానానికి అలా తల ఊగిస్తూనే ఉన్నారంట కార్యక్రమం జరుగుతున్నంతసేపూ" పక్కనే ఉన్న లాయరు మిత్రుడు సభ ముగిసి బయటికి వస్తూన్నప్పుడు ఛలోక్తిగా అడిగాడట "ఏం దాసుగారూ! తల తెగ ఊగింది ఇవాళ!"

"అవునండి. ఉంది. ఊగింది" అని దాసుగారి సమాధానం

మరి మీరూ స్వారస్యం ఆఘ్రాణించడంలో ఆ దాసుగారికన్నా తీసిపోలేదు తెలుగు అందచందాలను బాగానే ఆస్వాదించి ఉంటారు అవునా?!